ఏరియా దవాఖానలో సౌకర్యాల కల్పనకు చర్యలు

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 16: ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి ఏరియా దవాఖానలో సౌకర్యాల కల్పనపై సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సంగీతతో ఆయన రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దవాఖానలో సౌకర్యాల కల్పన కోసం ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహాతో చర్చించిన అంశాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక సదుపాయాల కోసం మరో కొత్త భవనాన్ని నిర్మిస్తామని అన్నారు.ఈ దవాఖాన కుత్బుల్లాపూర్‌లోని మెడికల్ కాలేజీకి అనుబంధంగా సేవలందిస్తుందని అన్నారు. కొత్తగా ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు ఇతర స్టాఫ్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఏరియా దవాఖానలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, తదితరులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్16 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 69 ఫిర్యాదులను ప్రజల నుంచి ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అందించిన వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లా ఆఫీసర్ చంద్రవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఫ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ జాం

రామంతాపూర్,డిసెంబర్ 16 : ఉప్పల్ రోజు, రోజుకూ ట్రాఫిక్ మయంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉప్పల్ నుంచి సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, రామంతాపూర్ ఇటు వరంగల్ వెళ్లాలంటే వాహనదారులు, పాదచారుల అవస్థలు వర్ణనాతీతం. ఉప్పల్ చౌరస్తా, లిటిల్ ఫ్లవర్ స్కూల్, సర్వేఆఫ్ ఇండియా, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అవుతుంది. తాజాగా సోమవారం లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద స్కూల్ వదిలి పెట్టడంతో ఒక్కసారి ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని బాటసారులు, వాహనదారులు కోరుతున్నారు.

ఉత్తమ ఉమెన్ పురస్కారం

మేడ్చల్, డిసెంబరు 16 : గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలతకు ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం లభించింది. సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల అకాడమిక్ పార్టనర్‌గా ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ పార్కు, ఈఎస్ఎన్ పబ్లికేషన్స్, బెంగుళూరు ఎస్ఈఏ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌తో కలిసి మద్రాస్‌లో ఆదివారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ దేశాల సభ్యులు పురస్కారాలను అందజేశారు. ఈ పురస్కారాల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత సూపర్ ఉమెన్ విభాగంలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు, డీన్‌ఆర్‌అండ్ డీ ఉత్తమ విద్యావేత్త అవార్డులను అందుకున్నారు. ప్రిన్సిపాల్‌కు పురస్కారం లభించిన సందర్భంగా కార్యదర్శి టీవీ రెడ్డి సత్కరించి, ప్రశంసించారు.

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం చిలుకానగర్ బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఇతర నాయకులు తరలివెళ్లి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కండ జగన్, ఫారుఖ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. *– రామంతాపూర్, డిసెంబర్ 16*

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

కీసర, డిసెంబర్ 16 : కీసర మండలం, చీర్యాల్‌లోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం రెండవ రోజు ఉదయం 9గంటల వరకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి తరలివచ్చారు. గట్టి పోలీసుబందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు.

సర్పంచ్‌లకు ఇచ్చిన మాటను సీఎం నిలుపుకోవాలి

ఘట్‌కేసర్ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16: సర్పంచ్‌లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుపుకోకుండా అరెస్ట్‌లు చేసి అడ్డుకోవడం దారుణమని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అమలుకాని హామీలు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను అధికారంలోకి వచ్చిన వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు మొండిచెయ్యి చూపుతున్నట్లు ఆరోపించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా మాజీ సర్పంచ్‌ల ఘోస వినపడడంలేదా అని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే అరెస్టులు చేయిస్తున్నారు తప్ప బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు. సర్పంచ్‌లు అప్పులు చేసి పనులు చేయించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఉద్యమించాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు.

రానున్న రోజుల్లో సాంకేతిక నగరాలు

అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూహెచ్ మాజీ వీసీ డాక్టర్ డీఎన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అరవిందు

మేడ్చల్, డిసెంబర్ 16 : రానున్న రోజుల్లో సాంకేతిక నగరాల ఏర్పాటు ఆవశ్యమని జేఎన్‌టీయూహెచ్ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో ఉన్న హితం(హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) కళాశాలలో ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మొదటి పునరుజ్జీవ నగరాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక నగరాల రూపకల్పన అవసరమన్నారు. రానున్న రోజుల్లో ఈ దిశగా విశేషంగా కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక ప్రాతిపదికన నగరాలు అభివృద్ధి చెందితే సౌకర్యాలు, భద్రత మెరుగుపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అరవిందు, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ సతీష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాఘవేంద్ర గుప్తా పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

దొంగకు దేహశుద్ధి చేసి చెట్టుకు కట్టోసిన ఎన్‌ఎఫ్‌సీనగర్ వాసులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16: దొంగతనం చేసేందుకు ఓ ఇంట్లోకి ప్రవేశించిన పాత నేరస్థుడిని పట్టుకుని.. కాళ్లు చేతులు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం వివరాల ప్రకారం... ఎన్‌ఎఫ్‌సీనగర్ బీ-1 కాలనీ సమీపంలో ఓ ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన కల్వకుర్తికి చెందిన పాత నేరస్థుడు వడ్డెర నరేశ్(35)ను స్థానికులు గమనించి పట్టుకున్నారు. తాళ్లతో చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడు పాత నేరస్థుడని, మహబూబ్‌నగర్ జిల్లాలో 4 దొంగతనం కేసులు ఉన్నాయని, ఇటీవల ద్విచక్రవాహనాన్ని దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. దొంగతనం కేసులు మహబూబ్‌నగర్‌లో ఉన్నందున అక్కడి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

వైద్య విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

హోమియో కళాశాల మైదానంలో క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు

రామంతాపూర్,డిసెంబర్ 16 : వైద్యవిద్యార్థులు వైద్య విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు అన్నారు. సోమవారం కళాశాల మైదానంలో కళాశాల 57వ వార్షికోత్సవంలో భాగంగా క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యార్థుల్లో ఫిజికల్ ఫిట్‌నెస్, క్రమశిక్షణకోసం క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఉత్సాహంతో క్రీడల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఈనెల 30న కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి సంవత్సరం కళాశాల వార్షికోత్సవంలో భాగంగా క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మూర్తి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ పార్థసారథి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ లకు ఆరోగ్యంపై అవగాహన

అంకిరెడ్డిపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కీసర, డిసెంబర్ 16: మహిళల ఆరోగ్యం కేవలం వారి వ్యక్తిగత శ్రేయస్సుకు మాత్రమే కాదని, ఆది కు టుంబ ఆరోగ్యం, సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సిద్ధార్థరెడ్డి, సెక్రటరీ విజయ శారదరెడ్డిలు తెలిపారు. కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామం లో సోమవారం మహిళల ఆరోగ్యంపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించి.. అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్ధార్థరెడ్డి, విజయ శారదరెడ్డిలు మాట్లాడుతూ.. శానిటరీ ప్యాడ్స్ వినియో గం, సర్వైకల్ క్యాన్సర్ నివారణ, శరీ ర శుభ్రత వంటి కీలక అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం తీసుకురావడమే తమ ప్రధాన ఉద్దేశ్యమన్నా రు. పౌష్టికాహారం ద్వారా మనసమా జం ఆరోగ్యవంతంగా ఉంటుందని, ప్రతి మహిళకు ఆరోగ్య విషయంలో చైతన్యం రావాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ ప్రీతిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతి

రామంతాపూర్, డిసెంబర్ 16 : నాచారం డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అంబేద్కర్‌నగర్ కార్తికేయనగర్ మధ్యలో ఉన్న పాత బ్రిడ్జి నిర్మాణం కోసం మంజూరైన రూ. 64 లక్షలు క్యాన్సిల్ అయినాయని, అక్కడ బ్రిడ్జి అవసరమన్నారు. రాంరెడ్డినగర్‌లో వర్షపునీటి సమస్య పరిష్కరానికి పైప్ లైన్ వేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. రాఘవేంద్రనగర్, అన్నపూర్ణకాలనీ, శాంతి గార్డెన్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు చర్యలు చేపడుతామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

మల్లికార్జుననగర్ కాలనీ అధ్యక్షుడిగా పరమేశ్‌రెడ్డి

మల్లాపూర్ డివిజన్ , మల్లికార్జుననగరన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎనుముల పరమేశ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కాలనీ అధ్యక్షుడి గా ఎన్నుకున్నందుకు కాలనీ అభివృద్ధికి పాటుపడుతూ పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంగిశెట్టి రవీంద్రసాగర్, దాసరి ధనుంజయ, మల్లారె డ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సోమ య్య, వెంకటేశ్, శివ, గోల్డ్ రమేశ్, ఎలక్షన్ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్, సైదులు, బాల్‌రాజ్‌గౌ డ్, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.
–మల్లాపూర్, డిసెంబర్ 16

కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం..

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 16 : అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 19, 20వ వార్డుల్లోని ఓల్డ్ విలేజ్‌లో రూ. 15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం చైర్మన్ ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఉన్న 20 వార్డుల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని, ఇప్పటికే కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లు, మురికి కాలువలు, పార్కులు, తదితర పనులు పూర్తి చేశామని అన్నారు. అందరి సహకారంతో నాగారం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, సుమిత్ర, నాయకులు సురేశ్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

రామంతాపూర్, డిసెంబర్ 16 : రవాణారంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉప్పల్, రామంతాపూర్, తదితర ప్రాంతాల్లో ఆటోట్రాలీ, డీసీఎం డైవర్ల సమస్యలను సోమవారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ట్రాలీ, ఆటో డ్రైవర్లపై ఆర్‌టీఏ అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. వారికి 2 బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలన్నారు. 2019 మోటార్ వాహనాల చట్టంను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న, వెంకటేశ్, ఎల్లయ్య, పర్వతాలు, దరశథ్, నర్సింహ, యాదగిరి, పాండు, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేవరకు ఉద్యమం..

నిరాహార దీక్షలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నేతలు

ఘట్‌కేసర్ పట్టణంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని రిలే నిరాహార దీక్ష చేస్తున్న కౌన్సిలర్ చందుపట్ల వెంకట్ రెడ్డి, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16 : ఘట్‌కేసర్ పట్టణంలో రైల్వే వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బీఆర్ఎస్ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని పట్టణ జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలో మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డితో పాటు ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన జి.బాబురావు, సురేశ్, శ్రీధర్, బొక్కో నిగూడకు చెందిన బొక్క ముత్యం రెడ్డి, కొండాపూర్‌కు చెందిన డాక్టర్ ముల్గురం జంగయ్య కూర్చున్నారు. వారికి మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు బండారి ఆంజనేయులు గౌడ్, షేక్ జహంగీర్, మండల రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్‌లు సంఘీభావం తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్‌తోపాటు బీబీనగర్, పోచంపల్లి, కీసర మండలాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వ పెద్దలు రాజకీయం చేస్తూ పనులను స్తంభింపచేసేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. ఘట్‌కేసర్ పట్టణానికి వచ్చే వారు, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు 2 కిలో మీటర్ల నడవాల్సి వస్తుందని, రాత్రి సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ సిరాజ్, జేఏసీ సభ్యులు బచ్చు ప్రమోద్ గుప్తా, బచ్చు నగేశ్‌గుప్తా, కమలాకర్, జ్ఞానేశ్వర్, అర్జున్, అశోక్ గౌడ్, ఎంఏ ఖలీల్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

మేధో సంపత్తితోనే విజయాలు సొంతం

పోటీల్లో ప్రతిభ కనబర్చి ట్రోఫిని అందుకుంటున్న సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ కమాండోలు

జవహర్‌నగర్, డిసెంబర్ 16: మేధో సంపత్తితోనే విజయాలు సొంతమవుతాయని, అంకితభావంతో సేవ చేస్తేనే సంపూర్ణ మానసిక స్థైర్యం లభిస్తుందని సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దీపక్ వర్మ అన్నారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 29వ ఇంటర్ కాఫ్ట్ డిబేట్ న్యూఢిల్లీలోని అటల్ అక్షయ ఊర్జా భవన్‌లో దేశంలోని సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధ బలగాలకు ఇటీవల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ హైదారాబాద్ గ్రూప్ నుంచి సాయుధ బలగాలు పాల్గొని ప్రత్యేక ప్రతిభ కనబర్చి ట్రోఫిని సాధించారు. మానవ హక్కుల సమస్యలపై అవగాహనలో ప్రతిభ కనబర్చి ఎస్సై రాహుల్, అసిస్టెంట్ కమాండెంట్ కన్హా జోషి విజయం సాధించారు. హిందీ, ఆంగ్లభాషలో అసిస్టెంట్ కమాండెంట్‌లు అక్షయ్ బడోలా, భాస్కర్ చౌదరి 2, 3 స్థానాల్లో గెలుపొందారు. సీఐఎస్ఎఫ్ కమాండోలు వివిధ పోటీల్లో పాల్గొని ట్రోఫిలను సాధించడం అనందంగా ఉందని దీపక్ వర్మ తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు

జవహర్‌నగర్, డిసెంబర్ 16 : క్రీస్తు బోధనలు ఎంతో పవిత్రమైనవని, క్రిస్మస్ పండుగవేళ దానం చేస్తే జీవితం ధన్యమవుతుందని మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఎస్ఐ ఆల్ సెయింట్స్ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆమె హాజరై మాట్లాడుతూ .. క్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీ తారాజశేఖర్, పాస్టర్ సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్‌లో..

రామంతాపూర్,డిసెంబర్ 16 : ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్‌లోని చర్చి పాదర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బిషప్‌జాషువా, సల్లాప్రభాకర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రమేశ్‌బాబు, వసంతకుమార్, అగ్రిప్పరాజు, అనిల్‌కుమార్, అనంద్‌గోయ్, రమేశ్‌పాల్ జాన్‌వెస్లీ , తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ముందడుగు.. సాకేత్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలు

సాకేత్ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద మైకులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన చెత్త ఆటో డ్రైవర్లను అభినందిస్తున్న కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఇతర సిబ్బంది

కాప్రా, డిసెంబర్ 16: కాప్రా సర్కిల్‌లో పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో వినూత్నంగా చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాల అమలులో భాగంగా సాకేత్ చెత్త ట్రాన్సిషన్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు, మైకులను ఏర్పాటు చేశారు. దీనివల్ల చెత్త ఆటోలు చెత్తను ఎప్పటికప్పుడు ఎలా డంపింగ్ చేస్తున్నది, ఎన్ని ఆటోలు చెత్త డంపింగ్ చేశాయని, ఒక్కో వాహనానికి ఎంత సమయం పడుతున్నదని.. సీసీ కెమెరాల ద్వారా వీక్షించే అవకాశం ఉంటుందని, తద్వారా వాహనాల నుంచి చెత్త డంపింగ్‌లో జరుగుతున్న జాప్యం వల్ల తలెత్తే సమస్యల నివారణకు సత్వరం చర్యలు తీసుకునేందుకు వెసులు బాటు ఉంటుందని కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ తెలిపారు. కాప్రా సర్కిల్ డీసీ ఆదేశాల మేరకు అటు పర్యవేక్షకులకు, ఇటు అధికారులకు ఉపయోగకరంగా సర్కిల్ పరిధిలోని ముఖ్యమైన జీవీపీ పాయింట్ల వద్ద 63 కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇందులో స్వచ్ఛ ఆటో డ్రైవర్లు 5 సీసీ కెమెరాలు, మైకులు ఏర్పాటు చేశారని సుదర్శన్ వివరించారు. సీసీ కెమెరాలు, మైక్ సెట్‌ను అందించిన స్వచ్ఛ ఆటో డ్రైవర్లు పెద్ద నర్సింహ, చిన్న నర్సింహులుతోపాటు కోట రవి, నాగేశ్‌లను శానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్ అభినందించారు. ఎస్ఎఫ్ఏ అంజలి, సాకేత్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వెహికిల్ మానిటరింగ్ సూపర్‌వైజర్ చందు పాల్గొన్నారు.

నాలా కబ్జాను నిలుపుదల చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16 : హైదరాబాద్-వరంగల్ బైపాస్ రోడ్డులోని సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న నాలాను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని స్థలాన్ని రక్షించాలని మారుతీ నగర్ వాసులు సోమవారం నిరసనకు దిగారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డి మారుతీనగర్‌లోని